గండి పడిన కాల్వ వద్ద వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబిత, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎడమ కాల్వకు గండ్లు

ఎస్కేప్ చానళ్లకు వేసవిలో వెల్డింగ్‌లు

- ఖమ్మం జిల్లా మంత్రుల బాధ్యతారాహిత్యం
- ప్రభుత్వమే బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలి
- ఇసుక మేటలకు 50వేలు, పంటనష్టానికి ఎకరాకు 30వేలు..
- బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల బృందం డిమాండ్
- నడిగూడెంలో ఎడమ కాల్వ గండ్ల పరిశీలన

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్3(నమస్తే తెలంగాణ) : 'నాగార్జునసాగర్ ఎడమ కాల్వ తెగడానికి ప్రధాన కారణం ప్రభుత్వమే. అందుకు రైతులు చూపిస్తున్న ఆధారాలే నిదర్శనం. ఖమ్మం జిల్లా మంత్రులు ఎండాకాలంలో సాగర్ నీళ్లు ఖమ్మంకు తరలిచేందుకు ఇక్కడి కాల్వ కట్టలపైన పోలీసులను పెట్టి ఎస్కేప్ చానళ్లకు, తూములకు వెల్డిండ్ టాకాలు వేశారు. దీంతో వరద ఉధృతి సమయంలో తూములు ఓపెన్ కాలేదు. ఎడమ కాల్వ రెండుమూడు చోట్ల తెగింది. కాల్వ కట్ట తెగి వేలాది ఎకరాలు నీట మునిగింది..ఇందుకు ప్రభుత్వమే కారణం' అని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఆరోపించింది. మంగళవారం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల బృందం సూర్యాపేట జిల్లాలో పర్యటించింది. నడిగూడెం మండలంలోని రామచంద్రాపురం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్టకు పడిన గండ్లను పరిశీలించారు. కాల్వకట్టకు గండ్ల పడిన పరిణామాలను, ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తూ రైతుల గోడు విన్నారు. అనంతరం కాల్వకట్ట పైనే మీడియాతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తు వల్లనే నష్టం జరిగి ఉంటే ఆపత్కాలంలో ప్రభుత్వంపై విమర్శలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇది స్పష్టంగా ప్రభుత్వం తన నిర్లక్ష్యంతో సృష్టించిన విలయమేనని విమర్శించారు. సాగర్ ఎడమకాల్వ గండ్లకు ఎస్కేప్ చానళ్లకు వెల్డింగ్ టాకాలు వేయించిన మంత్రులే కారణమని ఆరోపించారు. ఈ కాల్వ గండ్లకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరానికి రూ.50వేలు, దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

మంత్రుల వల్లే కాల్వకు గండి

మొదటిపేజీ తరువాయి...

జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా పట్టించుకోలేదు. పైగా ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్, ఖమ్మం, వైరా చెరువులకు నీటిని తరలిస్తుంటే నోరుమెదపనే లేదు. పాలేరుకు నీటిని తరలిస్తుంటే నల్లగొండ జిల్లా రైతులు వాడుకుంటారని ఖమ్మం జిల్లాల మంత్రులు కాల్వల వెంట పోలీసు బందోబస్తు పెట్టడమే కాకుండా కాల్వకు ఉన్న ఎస్కేప్ రెగ్యులేటర్లు, తూముల షటర్లను మూసి మళ్లీ తెరవరాకుండా వెల్డింగ్ చేయించారు. దాని పర్యవసానమే నడిగూడెం వద్ద ఎడమకాల్వకు గండి పడిందని రైతులు భగ్గుమంటున్నారు. మంత్రులు నిర్లక్ష్యం కారణంగానే దాదాపు 700 ఎకరాల్లో పంట నీటి మునిగిందని రైతులు మండిపడుతున్నారు. గత యాసంగి సీజన్‌లో కాల్వల ద్వారా ఒక్క తడికైనా నీటిని విడుదల చేయాలని రైతులతో పాటు రైతుల పక్షాన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. నేరేడుచర్ల, హుజూర్‌నగర్, పెన్‌పహాడ్ సహా వివిధ మండలాల్లో రైతులు ఆందోళనకు దిగారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా నీరందక సాగర్ ఆయకట్టు పరిధిలో దాదాపు లక్ష ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునగడం, పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో వేలాది ఎకరాల్లో తీరని నష్టం జరిగింది. దీనికితోడు కాగితరామచంద్రాపురం వద్ద గండి పడి మరో 700 ఎకరాల వరకు నీట మునిగింది.

తూముల వద్ద పహారా.. షటర్లు తెరవకుండా వెల్డింగ్

నాగార్జున సాగర్ ఎడమకాల్వ నీటిని ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఒక్కచుక్క నీటిని వాడుకోవద్దనే దురుద్దేశంతో మంత్రులు పొంగులేటి, తుమ్మల పన్నాగం పన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 12 నుంచి మూడు, నాలుగు రోజులపాటు సాగర్ ఎడమ కాల్వపై లస్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పోలీసులతో సుమారు 16 మంది బృందంతో ఒక్కో తూము వద్ద భద్రత పెట్టించారు. ఎస్కేప్ రెగ్యులేటర్లు, షటర్లను రైతులు ఎత్తి నీటిని పొలాలకు మళ్లించకుండా వాటికి వెల్డింగ్ చేయించారు. ఇప్పటికీ ఆ వెల్డింగ్‌ను తొలగించలేదు. సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదలవుతున్నా అధికారులు గానీ, మంత్రులు గానీ వాటి గురించే పట్టించుకోలేదు. ఇటీవల కాల్వ ద్వారా దాదాపు 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదే సమయంలో పాలేరు పూర్తిగా నిండి ఉండటంతో బ్యాక్‌వాటర్‌తో ఎడమకాల్వకు ఒత్తిడి పెరిగింది. దీంతోనే నడిగూడెం మండలం కాగితరామంద్రాపురం వద్ద గండి పడింది. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి బృందం పరిశీలనలో ఇదే విషయం తేలింది. గండిపడిన ప్రాంతాన్ని వారు మంగళవారం పరిశీలించారు. కాల్వకు గండి ఘటన ప్రకృతి విలయం కాదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమేనని విమర్శించారు.

ఎస్కేప్ తెరిస్తే ఇంత నష్టం ఉండేది కాదు

కాగితరామచంద్రాపురం రంగుల బ్రిడ్జి వద్ద నాకు మూడు ఎకరాల పొలం ఉన్నది. కాల్వకు రెండు చోట్ల గండి పడటంతో మా పొలాలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. అధికారులు ముందస్తుగా ఎస్కేప్‌లు తెరిస్తే ఇంత ప్రమాదం జరిగేది కాదు. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. మా పొలాల నిండా ఇసుక మేటలు వేశాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. మా భూముల్లో ఈ ఏడాది పంట పండే పరిస్థితి ఉండదు.

- నీలకంఠం సీతయ్య, కాగితరామచంద్రాపురం, నడిగూడెం

ఎకరాకు 50 వేల పరిహారం ఇవ్వాలి

కాగిత రామచంద్రాపురం రంగుల బ్రిడ్జి వద్ద నాకు, మా కుటుంబ సభ్యులకు ఐదున్నర ఎకరాలు ఉన్నది. సాగర్ ఎడమ కాల్వ తెగడంతో ఆ నీళ్లు మొత్తం మా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇప్పటి వరకు పంట కోసం ఎకరానికి 30 వేలకు పైగా వరకు ఖర్చు చేశాం. 400 ఎకరాలకు పైగా రైతులు నష్టపోయారు. ప్రభుత్వం ఒక్కో ఎకరానికి నష్టపరిహారం కింద రూ.50 వేల చొప్పున ఇచ్చి ఆదుకోవాలి.

-చక్రాల ఉప్పయ్య, కాగిత రామచంద్రాపురం, నడిగూడెం

మోదీ రావాలి.. 2 వేల కోట్లు ఇవ్వాలి

- వర్ష బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- వరద నష్టంపై త్వరలో ప్రధాని మోదీని కలుస్తాం
- ఖమ్మం, మహబూబాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



తమను ఆదుకోవాలని మహబూబాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకుంటున్న వరద బాధితులు

ఖమ్మం/వరంగల్ సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధులు): రాష్ట్రంలో వర్షం సృష్టించిన బీభత్సాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా పరిగణించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ విషయమై త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి తగిన ఆర్థికసాయం చేయాల్సిందిగా కోరనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరుతూ ప్రధానికి ఇప్పటికే లేఖ రాశామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఖమ్మం నుంచి బయలుదేరి డోర్నకల్, మహబూబాబాద్, కురవి మీదుగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో పర్యటించారు. అంతకుముందు ఖమ్మంలోని మంత్రి పొంగులేటి నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ప్రకృతి సృష్టించిన బీభత్సం వల్ల అనేక జిల్లాలు వరదనీటిలో చిక్కుకున్నాయని, అపారనష్టం సంభవించిందని, ఈ విషయాలను ప్రధానమంత్రికి వివరించి ఆర్థికసాయం కోరతామని చెప్పారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తారా అన్న ప్రశ్నకు.. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదని వ్యాఖ్యానించారు. ప్రధానిని తాను, తన మంత్రులే కలుస్తామని స్పష్టంచేశారు. వరదల వల్ల మరణించిన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, వాటిని ఆయన కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పిస్తే తమకు అభ్యంతరంలేదని వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.2 వేల కోట్లు వరద సహాయక చర్యలకు ఇవ్వాలని అన్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని రకాలుగా ముందస్తు చర్యలు తీసుకున్నా కొంత ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. ఆస్తి పత్రాలు, భూముల పట్టాదారు పాసుపుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఇతరత్రా ప్రభుత్వ గుర్తింపు పత్రాలు అన్నీ తడిసి పనికిరాకుండా పోయాయి. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అన్ని రకాల సర్టిఫికెట్లను కొత్తగా జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి నర్సంపేట, వరంగల్, జనగామ మీదుగా రోడ్డు మార్గంలో హైదరాబాద్ వెళ్లారు.

జిల్లాకో హైడ్రా ఉండాలి: సీఎం రేవంత్

వరంగల్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చెరువుల ఆక్రమణలపై రాష్ట్రవ్యాప్తంగా త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. చెరువులను ఆక్రమించినవారు ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని అన్నారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాకు ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లాలో వరద నష్టంపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఒక మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరద ముంచెత్తిందనే ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను యథేచ్ఛగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయ విపత్తుగా ప్రకటించలేం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కేంద్రం జాతీయ విపత్తు ప్రకటనలు చేయడంలేదని, అవసరమైతే ప్రధాని రాష్ట్రంలో పర్యటిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు, వరదలపై కేంద్ర ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు చేసినా రాష్ట్రంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వరదలతో మరణించిన వారి కుటుంబాలకు కేంద్రం నుంచి రూ.3 లక్షలు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రూ.5 లక్షల పరిహారంలో కేంద్ర నిధులు కలుపుకొంటారా? లేదా ? అనేది స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఎస్డీఆర్ఎఫ్ కింద రూ.1300 కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే ఆ డబ్బులతో బాధితులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే నిధులు విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

వారాంతంలోగా నష్టం వివరాలు

అధికారులకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నష్టంపై మంగళవారంసచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్రస్థాయికి పంపి, జీపీఎస్ కోఆర్డినేట్స్ సహా సమర్పించాలని స్పష్టం చేశారు.

587 రోడ్లకు భారీ నష్టం

ప్రాథమిక అంచనా ప్రకారం నష్టం రూ. 1200కోట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వర్షాల వల్ల 32 జిల్లాల్లో 587 రహదారులకు భారీగా నష్టం జరిగింది. ఒక వంతెన సహా 82రోడ్లు వరదలకు కొట్టుకుపోయాయి. 111బ్రిడ్జీలు, కల్వర్టులకు తీవ్ర నష్టం జరిగింది. తక్షణ మరమ్మతులకు రూ. 256 కోట్లు, శాశ్వత మరమ్మతులకోసం రూ.1,200 కోట్లు అవసరమవుతాయని రోడ్లు, భవనాల శాఖ అంచనా వేసింది. ఖమ్మంలో అత్యధికంగా 148 రోడ్లకు నష్టం జరగ్గా, 145 ప్రాంతాల్లో రోడ్లు ముంపునకు గురయ్యాయి. 26 చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. కొత్తగూడెంలో 26 కల్వర్టులు, బ్రిడ్జీలు దెబ్బతిన్నాయి. మహబూబాబాద్ జిల్లా కొరివిలో ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జీ పూర్తిగా కొట్టుకుపోయింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,500 కిలోమీటర్ల మేర రోడ్లకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా.

- సీతారామ ప్రాజెక్టు కాల్వకు గండి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం మద్దుకూరు శివారులో నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు కాల్వకు మంగళవారం గండిపడింది. దీంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాల్వలో నిలిచిన నీరంతా వృథాగా వెళ్తున్నది. పంటల పొలాలు నీట మునగగా మరింత నీరు దిగువకు వెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల వరి పొలాలు, పత్తి చేల్లో నీరంతా నిలిచిందని, మళ్లీ వర్షం వస్తే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాల్వకు పడిన గండిని పూడ్చాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. – చండ్రుగొండ

వట్టెం పంప్‌హౌస్ మునక

మొదటిపేజీ తరువాయి...

వర్షాలకు శ్రీపురం శివారులోని నాగనూలు చెరువు ఉప్పొంగింది. ఒక్కసారిగా చెరువు బ్యాక్‌వాటర్ పెరగడంతో సమీపంలో ఉన్న పొలాలను వరద ముంచెత్తడంతోపాటు వట్టెం రిజర్వాయర్‌కు నీటిని తరలించే కట్టకు సైతం గండిపడింది. దీంతో టన్నెల్‌లోకి భారీగా వరద పోటెత్తింది. అంతకుముందు నాగర్‌కర్నూల్ సమీపంలోని కుమ్మెర చెరువు వరద కూడా టన్నెల్‌లోకి చేరింది. వెంటనే కాంట్రాక్టర్లు అప్రమత్తమై అడ్డుకట్ట వేసి నీటిని నిలిపివేశారు. అయినప్పటికీ, చూస్తుండగానే పంప్‌హౌస్‌లోకి నీరు రావడంతో అధికార యంత్రాంగం షాక్‌కు గురైంది. ఆ వరద ఎక్కడి నుంచి వస్తున్నదో అధికారులు గుర్తించేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. చివరకు ఆ వరద నాగనూలు చెరువు వద్ద నుంచి టన్నెల్లోకి ప్రవేశించి పంప్‌హౌస్‌ను ముంచెత్తుతున్నట్టు గుర్తించిన అధికారులు పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగనూలు చెరువు బ్యాక్‌వాటర్ టన్నెల్లోకి వెళ్లకుండా ఆపేందుకు స్థానిక అధికారులు మంగళవారం మధ్యాహ్నం నుంచి చర్యలు చేపట్టారు. ఖాళీ సిమెంట్ సంచుల్లో రాక్‌చిప్స్‌ను నింపి గండిపడిన టన్నెల్ కట్టకు అడ్డుగా వేస్తున్నారు. చెరువు నుంచి నీరు కిందికి పోకుండా ఉండేందుకు సమీపంలోని బండరాళ్లను క్రేన్ల సాయంతో తెచ్చి కట్టగా నిర్మిస్తున్నారు. ఈ పనులు మంగళవారం సాయంత్రం వరకూ కొలిక్కి రాలేదు. బుధవారం లేదా గురువారం నాటికి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. టన్నెల్‌లోకి వెళ్లే నీటి ప్రవాహం నిలిచిపోయాక ఏమిచేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని పాలమూరు ఎత్తిపోతల పథకానికి చెందిన అధికారి 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు. నాగనూలు పెద్ద చెరువు 50 చదరపు కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉంటుంది. దీని పరిధిలో సుమారు 40 చిన్న చిన్న గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. దగ్గర దగ్గరగా ఉన్న ఈ చెరువులన్నీ ఉప్పొంగడంతో అక్కడి నీరంతా నాగనూలు చెరువుకు చేరింది. వరద భారీగా ఉండటంతో అధికారులు సైతం సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. సొరంగం తవ్విన ప్రాంతం దిగువన ఉండటంతో చెరువులోని బ్యాక్‌వాటర్ అంతా అడ్డుగా ఉన్న ప్రాంతాన్ని చీల్చుకొని సొరంగంలోకి ప్రవేశించింది. ప్రాథమిక అంచనా ప్రకారం సొరంగంలో దాదాపు 20 నుంచి 22 కిలోమీటర్ల మేర నీళ్లు చేరాయని అధికారులు భావిస్తున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం సమీపంలో ఉన్న వెంకటాద్రి రిజర్వాయర్ పంప్‌హౌస్‌కు వెళ్లే టన్నెల్లోకి పరుగులు పెడుతున్న నాగనూలు చెరువు బ్యాక్‌వాటర్

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

వట్టెం పంప్‌హౌస్ నీట మునగడం వెనుక ప్రభుత్వానికి ముందుచూపు లేదన్నది స్పష్టంగా అర్థమవుతున్నది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేయడంలో వెనుకబడిపోయింది. ఇప్పటికైనా వెంటనే నష్టాన్ని అంచనా వేసి పంప్‌హౌస్ పనులు పునరుద్ధరించాలి. **- మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

భారీగా ఆస్తి నష్టం.. తప్పిన ప్రాణనష్టం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఓ యజ్ఞంలో ప్రారంభించింది. గత డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ ప్రాజెక్టు పనులపై దృష్టి సారించడం లేదు. అరకొర నిధులు ఇవ్వడంతో కాంట్రాక్టర్లు, అధికార యంత్రాంగం ఉన్నదాంట్లోనే మంద కొడిగా పనులు నిర్వహిస్తున్నారు. వట్టెం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16 టీఎంసీలు. దీనికి తగ్గట్టుగా పంప్‌హౌస్ నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా దాదాపు పూర్తికావచ్చాయి. ఏదుల రిజర్వాయర్ నుంచి వట్టెం రిజర్వాయర్‌కు మధ్య దాదాపు 25 కిలోమీటర్ల మేర భూగర్భంలో సొరంగం నిర్మించారు. ఈ మార్గంలో వచ్చిన రాళ్లను బయటికి వెలికి తీసేందుకు మూడుచోట్ల ఎస్కవేషన్ సొరంగాలు ఏర్పాటుచేశారు. నాగనూలు, ఉయ్యాలవాడ, కుమ్మెర గ్రామల సమీపంలో ప్రధాన సొరంగం తవ్వేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో చెరువులకు సమీపంలో టన్నెల్లోకి వెళ్లే మార్గాలు ఉన్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోపాటు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఇంత పెద్ద మొత్తంలో వరద వస్తుందని అధికారులు ఊహించలేకపోయారు. ఈ నేపథ్యంలో గొలుసుకట్టు చెరువులన్నీ ఉప్పొంగడంతో ఆ వరద టన్నెల్‌ను ముంచెత్తింది.

నష్టం వందల కోట్లల్లో..

పాలమూరు ఎత్తిపోతల పథకంలో వట్టెం రిజర్వాయర్ కీలకం. ప్రాజెక్టుల పంప్‌హౌస్‌లను అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఒక్కో పంప్‌హౌస్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు మించి భారీ పంపులను బిగించారు. ఒక్కో పంప్‌హౌస్‌లో తొమ్మిది భారీ పంపులు, ఒక స్పేర్ పంపుతో కలిపి పది పంపులు ఏర్పాటు చేశారు. సుమారు రూ.3,000 కోట్లతో ఈ నిర్మాణం జరుగుతున్నది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత పనుల్లో వేగం తగ్గింది. తాజాగా సొరంగంలో వరద నీరు ప్రవేశించడంతో నష్టం రూ.కోట్లల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు. వరదతో పాటు బురద కూడా వచ్చే అవకాశం ఉన్నందున ఈ మొత్తం పంపుల్లోకి చేరి భారీ నష్టానికి దారితీస్తుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

పీఆర్ఎల్ఐని పట్టించుకోని సర్కారు : నిరంజన్‌రెడ్డి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల (పీఆర్ఎల్ఐ)ను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఖమ్మం, వరంగల్ వరదల్లో ప్రాణనష్టం సంభవించిందని దుయ్యబట్టారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

నిర్లక్ష్యం వల్లే నీట మునిగింది

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించింది. వట్టెం వద్ద నిర్మించిన మూడో పంప్‌హౌస్ మెగా కంపెనీ నిర్లక్ష్యంతోనే నీటమునిగింది. వరదలు వచ్చినప్పుడు నీళ్లు పారుతాయని ఈ కంపెనీకి గానీ, అధికారులకు గానీ తెలియదా? లిఫ్ట్ ప్రారంభానికి ముందే ఈ పరిస్థితి రావడం దారుణం. నీటిని ఎత్తిపోసినా కొనుగోలు చేసేటప్పుడు ఉన్నంత సామర్థ్యంతో మోటర్లు పనిచేయవు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మెగా ఏజెన్సీపై, అధికారులపై చర్యలు తీసుకోవాలి. **- నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి**

ముందస్తు చర్యలతోనే 3 వేల మందిని రక్షించాం

- రాష్ట్రవ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలు: పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలవల్ల 3,039 మందిని రక్షించగలిగామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాలల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 117 గ్రామాలలో 67 వేల మంది భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభావితమయ్యారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించామని తెలిపారు. 44 ఇండ్లు పూర్తిగా దెబ్బతినగా, వారికి కొత్త ఇండ్లు మంజూరు చేయాలని చెప్పారు. 600వరకు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. 51 బ్రిడ్జీలు, 249 కల్వర్టులు, 166 ట్యాంక్‌లు దెబ్బతిన్నాయని, 13,342 జీవాలు మృతి చెందాయని తెలిపారు.